క్లుప్తంగా

నేడు పాఠశాలలు బంద్



గద్వాల అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలలు బంద్ చేస్తున్నట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గణేష్, జిల్లా కన్వీనర్ సురేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్స్‌లు విక్రయిస్తున్న వాటిపై చర్యలు తీసుకోవాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాల్లో పేదలకు 25 శాతం సీట్లు ఇవ్వాలన్నారు. ఈ బంద్ జిల్లాలోని పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు అశోక్, వెంకటేష్, నరేష్, మురళీ, నరేష్ ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం విద్యార్థులతో అధిక ఫీజులు, స్కాలర్ షిప్‌లను వసూల్ చేస్తుండడంతో తహసీల్దార్ సలీముద్దీన్‌కు నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కిరణ్, దామోదర్, గోవిందు, రాకేష్, తదితర్లు పాల్గొన్నారు.

ఫార్మసిస్ట్‌కు ఘన సన్మానం



అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న పుష్పకుమారి గ్రేడ్–1 ఫార్మసిస్ట్‌గా పదోన్నతి రావడంతో మహబూబ్‌నగర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం క్యాతూర్ పీహెచ్‌సీలో ఆమెను ఘనంగా సన్మానించారు. రెగ్యులర్ స్టాఫ్‌నర్స్‌లుగా ఎంపికైన లలిత, బాలసిద్దేశ్వరిలను సన్మానించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రసూనరాణి, జీహెచ్‌ఓ లక్ష్మీకాంతం, హెచ్‌ఏ బాలీశ్వరయ్య శెట్టి, అక్కమ్మ, నాగేశయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గానగర్‌లో సమస్యల వెల్లువ



అయిజ: మున్సిపాలిటీలోని దుర్గానగర్ కాలనీలో సమస్యలు పెరగడంతో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలోని ప్రజలతో మాట్లాడారు. కాలనీలోని బ్రహ్మారెడ్డి ఆస్పత్రి వెనుక తాగునీటి పైప్‌లైన్ లీకవుతోందని, దాని వల్ల ఆ ప్రదేశం మురుగు కుంటగా మారిందని ప్రజలు తెలిపారు. దుర్గానగర్‌లోని మరో ప్రదేశంలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ వల్ల రోడ్డుపై నీరు పారుతోందని ప్రజలు వాపోయారు. డ్రెయినేజీలో ప్లాస్టిక్ కవర్లు, పూడిక ఉండడం వల్ల డ్రెయినేజీ నీరు ముందుకు వెళ్లడంలేదని దుర్వాసన వెదజల్లుతోందని, దాని వల్ల దోమలు ఉధృతి చెంది రోగాలు వ్యాపిస్తున్నాయని మహిళలు పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ అధికారులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మన్న, జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు జవాన్లు, ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు.

కన్నీళ్లు పెట్టుకున్న విద్యార్థులు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల కారుణంగా పాఠశాలను విడిచి వెళ్తుంటే విద్యార్థులంతా ఉపాధ్యాయుల చుట్టు చేరి కన్నీటి పర్యాంతమయ్యారు. ఇంతకాలం ఉపాధ్యాయులతో వారి అనుబంధం ఒక్కసారిగా గుర్తు చేసుకుంటూ బోరున విలపించారు.

రూ.71వేల ఆర్థిక సాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని పుటాన్‌దొడ్డి గ్రామానికి చెందిన బోయ నరసింహ ఇటీవల విద్యుదాఘాతంతో అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న పుటాన్‌దొడ్డి గ్రామ యువత మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.71వేల ఆర్థిక సాయం అందజేశారు.

పంట కల్లాలపై నిరాసక్తి



సాసనూలులో ఏర్పాటు చేసిన పంట కల్లం

- ఖర్చు పెరగడంతో ఆసక్తి చూపని అన్నదాతలు
- నియోజకవర్గానికి 1281 యూనిట్ల మంజూరు
- ప్రారంభానికి నోచుకోనివి 770యూనిట్లు
- రైతుల్లో అవగాహన లోపం
- జాబుకార్డులున్న వారికే మంజూరు

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అందులో భాగంగానే రైతుల అభివృద్ధి కోసం గతంలో రైతు వేదికలతో పాటు కల్లాల నిర్మాణం కూడా చేపట్టింది. నియోజకవర్గ వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న రైతులకు సిమెంట్, కాంక్రీట్‌తో నేరుగా పొలాల్లోనే కల్లాలను నిర్మిస్తున్నారు. వాటి నిర్మాణానికి కావల్సిన నిధులు ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరు చేస్తున్నారు. వాటిని నిర్మించడం వల్ల రైతులు పండించిన పంటలను ఇంటికి తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండానే నేరుగా కల్లాల్లోనే ఆరబెట్టుకునే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో నియోజకవర్గానికి గతంలో 1281 యూనిట్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 511 యూనిట్లను మాత్రమే రైతులు నిర్మించారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి. మిగిలిన 770 యూనిట్లలో అవగాహన లోపం వల్ల కల్లాల నిర్మాణం పనులు నేటికీ ప్రారంభించలేదు.

మంజూరైనా నిర్మించలేదు..

కల్లాల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్న చాలా మంది రైతులకు మంజూరైనా నేటికీ నిర్మాణం



ఇటిక్యాలలో రైతు నిర్మించుకున్న కల్లాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

పనులు చేపట్టలేదు. గతంలో ప్రభుత్వం నుంచి కల్లాల నిర్మాణం కోసం అనుమతులు వచ్చినా నిర్మాణ ఖర్చు ఎక్కువ అవుతుండటంతో చాలా మంది రైతులు ఆసక్తి చూపడం లేదు. తప్పనిసరిగా పంట పొలాల్లోనే నిర్మించుకోవాలని అధికారులు ఆదేశించడంతో స్థలం వాటికి కేటాయిస్తే ఉన్న కొంచెం పొలంలో పంట తగ్గుతుందని భావించి సన్నకారు రైతులు కల్లాలపై ఆసక్తి చూపడం లేదు. కల్లాలు నిర్మించుకొని ప్రతి పంటను ఆరబెట్టుకొని అమ్మితే మంచి ధరలు వస్తాయని రైతులకు అధికారులు సూచిస్తున్నారు.

అనుమతి ఇలా..

కల్లాల నిర్మాణం అధికారులు మూడు రకాలుగా విభజించారు. రైతులకు తమ పొలాల్లో అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి ఏవిధంగా నిర్మించాలో అధికారులు అనుమతి ఇస్తున్నారు. దీనిలో భాగంగా 50 మీటర్ల (538 చ.అ) కల్లాన్ని నిర్మిస్తే రూ. 56,187, అలాగే 60 మీటర్లకు (645 చ.అ) రూ. 68వేలు, 75 మీటర్లకు (807 చ.అ) గాను రూ. 85వేల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నారు.

మండలాల వారీగా వివరాలు..

మండలం	మంజూరు	పూర్తయినవి
ఇటిక్యాల	238	58
మానవపాడు	110	104
ఉండవెల్లి	123	66
అలంపూర్	184	33
రాజోళి	196	84
వడ్డేపల్లి	174	60
అయిజ	256	106

ఉపయోగంపై అవగాహన కల్పించాలి..



మా గ్రామంలో ఇరవై యూనిట్లకు పైగా రైతు కల్లాలు మంజూరయ్యాయి. కానీ కల్లాల నిర్మాణం చేపట్టేందుకు అవగాహన లోపం వల్ల రైతులు ముందుకు రావడం లేదు. గ్రామంలో ఇప్పటి వరకు కేవలం రెండు యూనిట్లు మాత్రమే నిర్మించారు. స్థానిక అధికారులు గ్రామాల్లో పర్యటించి కల్లాల ఉపయోగంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. కల్లాల నిర్మాణం చేసుకున్న రైతులకు కూడా సకాలంలో బిల్లులు మంజూరయ్యేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– బాబురెడ్డి, రైతు, సాసనూలు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి..



మండలంలో ఇప్పటివరకు 238 మంది రైతులు కల్లాల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి దరఖాస్తు చేసుకున్న రైతులకు అందరికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. కానీ నిర్మాణం ఖర్చులు పెరగడంతో రైతులు కల్లాలను నిర్మించుకోవడానికి ముందుకు రావడం లేదు. ప్రతిరైతు తప్పకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వాటికి అయ్యే ఖర్చంతా ప్రభుత్వమే మంజూరు చేస్తుంది. కల్లాలు పంటలను ఎండబెట్టుకోవడానికి రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయి.

– అనిల్, ఏపీఓ, ఇటిక్యాల

ప్రజలకు అందుబాటులో ఉండాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ మధుబాబు

రాజోళి: వైద్య సిబ్బంది ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అల్బెండజోల్ మాత్రల పంపిణీపై సిబ్బందితో మాట్లాడారు. వైద్య సిబ్బంది సూచించిన మేరకు గ్రామాల్లో ఎటువంటి అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నారు, ఫ్రైడే, డ్రైడే పై కార్యక్రమాలు, టీబీ సంబంధిత వ్యాధులపై ప్రజలను ఎలా అప్రమత్తం చేస్తున్నారనే అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామంలో, ప్రతి కుటుంబంలో తప్పకుండా వైద్య సలహాలు అందించే విధంగా ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పని చేయాలన్నారు. ఇంటి దగ్గర జరిగే ప్రసవాలపై జరిగే అనర్థాలను తెలియచేస్తూ, ఆస్పత్రిలో ప్రసవాలు జరిగితే తల్లీబిడ్డకు ఎంతటి సురక్షత ఉంటుందో తెలిపాలన్నారు. కార్యక్రమంలో టీబీ నోడల్ పర్సన్ జయప్రకాష్, రంజిత్ కుమార్, రామకృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రిజ్వానా తాన్విర్ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎమ్‌లు, ఆశలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగర్ తదితర వ్యాధులపై ఆయా గ్రామాల వారీగా వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారిని గుర్తించి నెలవారిగా మందులు ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యమహిళా కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యకేంద్ర పరిధిలోని గ్రామాల ప్రజలకు 60 మందికి వైద్య పరీక్షలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు చంద్రన్న, ఫార్మాసిస్ట్ తిరుమల్ రావు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశలు పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకుల ధర్నా



అయిజ: మండలంలోని ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించడంలేదని, అయినా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఏబీవీపీ నాయకులు మండల విద్యాధికారి కార్యాలయం ముందు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్ మాట్లాడారు. మండలంలో ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, దుస్తులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని, అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలపై విద్యాధికారులు చర్యలు చేపట్టి వాటిని మూసి వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఎంఈఓ నరసింహకు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ఎస్‌ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ నరేష్, చందు, శ్రీహరి, షేక్షావలి, విజయ్, మహేంద్ర, హరి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మా పిల్లల కష్టాలను పట్టించుకోండి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

రాజోళి: కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న పిల్లలు పడుతున్న కష్టాలను పట్టించుకుని, వాటిని పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ఎంపీడీఓ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజోళిలో కస్తూర్బా పాఠశాల ప్రారంభించి ఏడు సంవత్సరాలు దాటినా నేటి వరకు భవన నిర్మాణం పూర్తి కాలేదని, దీంతో మండలానికి చెందిన వారిని కూడా, వడ్డేపల్లిలోని భవనంలో ఉంచడంతో వారు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బాత్‌రూంలు, పడుకునే గదులు ఇతర వసతులు సక్రమంగా లేకపోవడంతో రెండు మండలాల విద్యార్థులు కష్టాలు పడుతున్నారన్నారు. నూతన భవనం నిర్మాణం పూర్తయ్యేలోగా ఇతర భవనంలోనైనా తమ పిల్లలను ఉంచాలని విజ్ఞప్తి చేశారు. బాలికలు పడుతున్న ఇబ్బందులను ఇన్నేళ్లుగా పట్టించుకోకపోవడం వల్ల సమస్య రోజురోజుకు పెరుగుతోందని, వీలైనంత త్వరగా మండల కేంద్రంలో తాత్కాలిక భవనం ఏర్పాటు చేసి విద్యార్థులను అక్కడికి మార్చాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెట్లపై వేలాడుతున్న తీగలు



మానవపాడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డు మార్గం గుండా విద్యుత్ తీగలు చెట్లకు తాకి షాక్ సర్క్యూట్ అవుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెట్ల కొమ్మలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా రహదారులు

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు ప్రమాదకరంగా మారాయి. బిజ్వారం నుంచి గద్వాల, మల్దకల్ నుంచి గట్టు, తాటికుంట స్టేజీ నుంచి తప్పెట్లమొర్సు, ఎల్కూరు నుంచి మల్దకల్, మల్లెందొడ్డి నుంచి విఠలాపురం గ్రామాల రహదారులపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. వర్షాలకు రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు చేరి గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అయిజ–గద్వాల ప్రధాన రహదారిలోని పెద్దపల్లి స్టేజీ సమీపంలో రైతులు పైప్‌లైన్ కోసం తవ్వడంతో ప్రమాదకరంగా రహదారి మారింది. అమరవాయి, సద్దలోనిపల్లి గ్రామాల మధ్య తిమ్మారెడ్డి వ్యవసాయ పొలం వద్ద రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడటంతో ఇదివరకే ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డారు. అధికారులు రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరినప్పటికీ అధికారుల్లో ఎలాంటి చలనం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న రోడ్లపై గుంతలకు మరమ్మతు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిన నీరు

పట్టించుకోవడం లేదు



అయిజ–గద్వాల రహదారిలోని తిమ్మారెడ్డి వ్యవసాయ పొలం వద్ద రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. గుంతలకు మరమ్మతు చేపట్టి సమస్యను పరిష్కరించాలి.

– తిమ్మన్న, అమరవాయి

సమస్యలు పరిష్కరిస్తాం..



మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. ఇ ప్పటికే రహదారులను పరిశీలించి నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు అందజేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం.

– బషీర్, పంచాయతీరాజ్ ఏఈ, మల్దకల్

మంత్రితో వీడియో కాన్ఫరెన్స్

అయిజ: మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం ఏడీఏ సక్రియా నాయక్ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రైతు భరోసా పథకం విధివిధానాల రూపకల్పన కోసం రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని చర్చ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అలంపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల వ్యవసాయ అధికారులు, ఆయా మండలాల ఏఈఓలు, రైతులు హాజరయ్యారు. రైతు భరోసా కార్యక్రమం అమలుచేసే విధానంపై తమ అభిప్రాయాలు తెలుపాలని రైతులను వ్యవసాయ అధికారులు కోరారు. రైతులకు ఇచ్చిన తెల్లకాగితాలపై రైతులు వారి వారి అభిప్రాయాలను రాసి సంతకాలు చేసి వ్యవసాయ అధికారులకు ఇచ్చారు. రైతు భరోసా పథకంలో 5 ఎకరాల వరకు కటాఫ్ పెట్టాలని కొంతమంది రైతులు కోరగా, 10 ఎకరాలకు కటాఫ్ పెట్టాలని మరికొందరు రైతులు కోరారు. కటాఫ్ లేకుండా వ్యవసాయం చేసే అన్ని ఎకరాలకు రైతు భరోసా వర్తింపజేయాలని మరికొంతమంది రైతులు కోరారు. రైతుల అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఏడీఏ సక్రియా నాయక్, మండల వ్యవసాయ అధికారులు

బ్యాంక్ సేవలపై అవగాహన ఉండాలి

ఎర్రవల్లిచౌరస్తా: ప్రతి ఒక్కరికీ బ్యాంక్ సేవలపై అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ రాఘవేంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఎర్రవల్లి మండలంలోని రాజశ్రీ గార్లపాడులో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, డిజిటల్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ ఆధ్వర్యంలో నగదు రహిత లావా దేవీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిపాజిట్లు, డిపాజిట్ల ఖాతాలు, లావా దేవీల నిర్వహణ, ఖాతాలలోని అదనపు ప్రయోజనాలు, ఫిర్యాదులు, పరిష్కార వ్యవస్థ, వయోవృద్ధులకు అందిస్తున్న బ్యాంకింగ్ సదుపాయాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగదు రహిత లావాదేవీలు నిర్వహించే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏదైనా లావాదేవీలలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే బ్యాంకులో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కోదండాపురం ఏఎస్‌ఐ సోఫీ, ట్రైనర్ మధుకృష్ణ, రవిసాగర్, లక్ష్మణ్, రాజు, పరుశ, సుధాకర్, హుస్సేన్, రాజశేఖర్ ఉన్నారు.



నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాస్వామ్యానికి ఎమర్జెన్సీ మాయనిమచ్చ

గద్వాల: అధికారాన్ని కాపాడుకోవడానికి దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తన హయాంలో దేశంలో ఎమర్జెన్సీ విధించడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని బీజేపీ జాతీయ కార్యదర్శి పేరాల చంద్రశేఖర్‌జీ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక డీకే బంగ్లాలో నిర్వహించిన యాంటీ ఎమర్జెన్సీ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ఎమర్జెన్సీ దురాగతాలకు 50 ఏళ్లు పూర్తయిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని అణచివేసి, భారత రాజ్యాంగాన్ని పూర్తిగా తిరస్కరించి, దేశాన్ని జైలుగా మార్చిన ఆ రోజును దేశంలోని కొత్తతరం ఎన్నటికీ మర్చిపోదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, పార్టీ నాయకులు అప్సర్‌పాష, శివారెడ్డి, మీర్జాపురం రామచంద్రారెడ్డి, నర్సింహులు, దేవదాస్, కౌన్సిలర్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

వంతెనలు నిర్మించండి

మానవపాడు: మండలంలోని గోకులపాడు, చెన్నిపాడు గ్రామాల రైతుల పంటపొలాలకు వెళ్లేందుకు బొంకూర్ శివారు, చంద్రశేఖర్‌నగర్, కొర్విపాడు శివారు పొలాలకు వెళ్లడానికి రైతులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే వాగుపై వర్షపునీరు ప్రవహిస్తూ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో గోకులపాడు, చెన్నిపాడు గ్రామ రైతులు గతంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా పనులు చేపట్టలేదు. గతంలో ఎమ్మెల్యేలకు సైతం వినతిపత్రాలు అందించారు. చాలా సంవత్సరాలుగా రైతులకు ఉపయోగపడే రోడ్డు నిర్మాణాలను, వంతెనలు ఏర్పాటు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రోడ్డు నిర్మాణాలు, వంతెనలు ఏర్పాటు చేయాలని, రైతులు కష్టాలను తీర్చాలని రైతులు కోరుతున్నారు.



గోకులపాడు- చెన్నిపాడు దారిలో వాగు పరిస్థితి

అర్చకుల సమస్యలు పరిష్కరించాలి

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలోని మార్కెట్ యార్డులో దూప దీప నైవేద్య అర్చకుల సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. మంగళవారం ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు వాసుదేవ శర్మ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఆలయాలకు సేవలు చేస్తున్న వారే దూప దీప, నైవేద్య అర్చక సంఘం వారిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి సమస్యలను, డిమాండ్లను పరిష్కరించేలా చూడాలన్నారు. అర్చకులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు, గౌరవ వేతనం, ప్రభుత్వ గుర్తింపు కార్డులు, తదితర వాటిని అందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నాగదక్షిణామూర్తి, కోశాధికారి హరికిషన్ శర్మ, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్ శర్మ, వెంకటాద్రి స్వామి, అధికార ప్రతినిధి రవి, నరేంద్ర చారి, లక్ష్మీకాంతరావు, మహేష్, చంద్రశేఖర్, సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాసుదేవ శర్మ

పూర్వవిద్యపై అంగన్‌వాడీలకు శిక్షణ



శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న డీడబ్ల్యూఓ సుధారాణి

మానవపాడు: మండల కేంద్రంలో రెండో రోజు ప్రియదర్శిని పూర్వ విద్యపై అంగన్‌వాడీలకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం డీడబ్ల్యూఓ సుధారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్య సంరక్షణ అంగన్‌వాడీల శిక్షణ తరగతులు పరిశీలించామన్నారు. పిల్లల్లో 3 నుంచి 6 సంవత్సరాలు పెరుగుదల వేగంగా ఉంటుందని తెలిపారు. టీచర్లు, తల్లిదండ్రులు వారి అలవాట్లు ఇంటి వద్దకే విద్య ఆటపాటల విద్య అనే కార్యక్రమాలను ప్రవేశ పెట్టడం శిక్షణ కార్యక్రమంలో అంగన్‌వాడీలకు వివరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాటీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.